www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 20 నవంబర్ 2022

ఎస్సీ, ఎస్టీ సెల్

డీఎస్పీగా విష్ణు రఘువీర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : చిత్తూరు ఎస్సీ, ఎస్టీ సెల్ డిఎస్పీగా విష్ణు రఘువీర్ శనివారం భాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో జరిగిన డీఎస్పీస్థాయి అధికారుల బదిలీలో భాగంగా చిత్తూరులో ఖాళీగా ఉన్న ఎస్సీ,ఎస్టీ సెల్ విభాగానికి విష్ణు రఘువీర్ డీఎస్పీగా నియమించింది. గతంలో విజయవాడ హెడ్ ఆఫీస్‌లో పనిచేస్తూ చిత్తూరుకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ ని మర్యాద పూర్వకంగా కలిశారు.

మెనూలో మార్పులు

- **21వ తేదీ నుంచి కొత్త మెనూ అమలు**
- **ప్రభుత్వ ఉత్తర్వులు జారీ**
- **కొత్త విద్యాశాఖ కసరత్తు**

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: విద్యాశాఖలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం నాడు-నేడు పేరుతో ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల కల్పన రూపురేఖల్లో సమూల మార్పులు తీసుకొచ్చింది. నాడు- నేడు మొదటి విడత కోట్లాది రూపాయలు ఖర్చు చేసిన ప్రభుత్వం రెండో విడతలో జిల్లాలోని రూ.401.83కోట్లతో 1,186 పాఠశాలలు, 30జూనియర్ కళాశాలలున్నాయి. తల్లుల కమిటి ద్వారా పాఠశాల అభివృద్ధి చేపట్టాల్సిన పనులు చేపడుతున్నారు. నాడు- నేడు ద్వారా 441 పాఠశాలల్లో రూ. 208.24లక్షల ఖర్చు చేసి 1,655 తరగతి గదుల నిర్మాణాలు జరుగుతున్నాయి.

269 అంగన్వాడీ పాఠశాలల్లో ఫ్రీఫౌండేషన్ సూల్స్ అమలు చేస్తున్నారు. అమ్మఒడి, జగన్న విద్యాకానుక అమలు చేస్తున్న ప్రభుత్వ అత్యాంత ప్రాధాన్యతగా జగన్న గోరుమద్ద పథకాన్ని అమలు చేస్తోంది. జిల్లాలోని 2,475 పాఠశాలల్లో ఉన్న 1,74,524 మంది పిల్లలకు జగనన్న గోరుముద్ద పథకం అమలు చేస్తోంది.

ఈ నెల 21 నుచి కొత్త మెనూ..

జగన్న గోరుమద్దు పేరుతో రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులు అందిస్తున్న పౌషకాహారంలో కొన్ని మార్పులతో ఈనెల 21వ తేదీ కొత్తమెనూ ప్రకారం ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు అందించనున్నారు. ఈ మేరకు పాఠశాల విద్యావిభాగం మిడ్ డే మీల్స్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. కొత్త మోను జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వబడుల్లో అమలు చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఈ

మేరకు కొత్త మెనూ ఈనెల 21వ తేది నుండీ అమలు చేయాలంటూ మండల విద్యాశాఖాధికారులకు జిల్లా విద్యాశాఖాధికారి సర్క్యులర్స్ జారీ చేశారు. విద్యార్థులకు పోషక విలువలతో కూడిన 'గోరుముద్ద'ను ప్రభుత్వం వడ్డించనుంది. ఈ మేరకు విద్యార్థులకు పోషకాహారంతో కూడిన మెనూను పక్కాగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం కొత్త మోను అమల్లోకి తీసుకొచ్చింది.

మెనూ అమలు ఇలా...

సోమవారం
ప్రస్తుత మెనూ: అన్నం, పప్పుచారు, కోడిగుడ్డు కూర, చిక్కీ
కొత్తమెనూ : హాట్ పొంగల్, ఉడికించిన కోడిగుడ్డు/ కూరగాయల పులావ్, కోడి గుడ్డుకూర, చిక్కీ

మంగళవారం
ప్రస్తుతం: చింతపండు/ నిమ్మకాయ పులిహోర, టమాట పప్పు, ఉడికించిన కోడిగుడ్డు
కొత్తమెనూ: చింతపండు/ నిమ్మకాయ పులిహోరా, టమాట పచ్చడి/ దొండకాయ పచ్చడి, ఉడికించిన కోడిగుడ్డు

బుధవారం
ప్రస్తుతం: కూరగాయల అన్నం, బంగళా దుంపకుర్మా, ఉడికించిన కోడిగుడ్డు, చిక్కీ
కొత్తమెనూ: కూరగాయల అన్నం, బంగాళ దుంపకుర్మా, ఉడికించిన కోడిగుడ్డు, చిక్కీ

గురువారం
ప్రస్తుతం: కిచిడి, టమాటపచ్చడి, ఉడికించిన కోడిగుడ్డు
కొత్తమెనూ: సాంబార్ బాత్, ఉడికించిన కోడిగుడ్డు

శుక్రవారం
ప్రస్తుతం: అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన కోడిగుడ్డు, చిక్కీ
కొత్తమెనూ: అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన కోడిగుడ్డు, చిక్కీ

శనివారం
ప్రస్తుత మెనూ : అన్నం, సాంబార్, తీపిపొంగలి
కొత్తమెనూ : ఆకుకూర అన్నం, పప్పుచారు, తీపిపొంగలి

అంగన్వాడీలను పర్మినెంట్ చేయాలి

జిల్లా మహాసభల్లో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి వాణిశ్రీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అంగన్వాడీలకు గతంలో ఇచ్చిన హామీలు ప్రకారం ప్రభుత్వాలు పర్మినెంట్ చేయాలని ఏపీ అంగన్వాడి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి ఎస్ వాణిశ్రీ డిమాండ్ చేశారు. శనివారం చిత్తూరు సిఐటియు ఆఫీసు అరుణప్రాంగణంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా మహాసభలు జరిగాయి. ఈ మహాసభలకు అధ్యక్ష వర్గంగా పద్మ, ప్రమీల, పంచవర్ణలు వ్యవహరించారు. మొదట సిఐటియు జెండాను ఆవిష్కరించి చనిపోయిన వారికి నివాళులు అర్పించారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర నాయకులు వాణిశ్రీ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలపై చిన్నచూపు చూడటం దారుణమన్నారు. ప్రతి సంవత్సరం ఐసీడీఎస్‌కి బడ్జెట్లో కోత పెడుతున్నారని దీనివల్ల అంగన్వాడీ సెంటర్ల నిర్వహణ కష్టతరంగా మారిందని తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణలో భాగంగా ఇప్పటికీ అక్షయపాత్ర లాంటి వాటిని ప్రవేశపెట్టడం దుర్మార్గం అన్నారు. శిశు మరణాలు రేటు తగ్గించడంలో అంగన్వాడీలు కీలకపాత్ర పోషిస్తున్న తరుణంలో ఐసిడిఎస్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిపోయి నిర్వీర్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. గత మూడు సంవత్సరాల్లో అంగన్వాడీల సమస్యలపై చేసిన పోరాటాలను సమీక్ష చేసుకొని భవిష్యత్‌కార్యాచరణ నిర్ణయిస్తామని తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాడ గంగరాజు, పి.చైతన్యలు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గత ఎనిమిది సంవత్సరాల కాలంలో ఐసిడిఎస్‌ని ప్రైవేటీకరణ చేసే దిశలోనే ప్రయత్నాలు చేస్తున్నదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను అనేక పోరాటాలు చేసుకుని సాధించిన హక్కులను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. సమస్యలు పరిష్కారం కోసం పోరాటాలు చేస్తుంటే వాటిని అణచ వేయడానికి దాడి చేయడం సిగ్గుచేటు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికవర్గ పోరాటాలపై ఉక్కుపాదం మోపితే కన్నెర్ర చేసిన కార్మికవర్గంపై ఆ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించిన చరిత్ర వుందని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం తెల్సుకోవాలని హెచ్చరించారు. ఇప్పటికైనా అంగన్వాడీల సమస్యలు పరిష్కారం కోసం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. మహాసభల్లో యూనియన్ నాయకులు లలిత, షకీల, పద్మ, కస్తూరి, 11 ప్రాజెక్టుల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. సిఐటియు నాయకులు సురేంద్రన్ పాల్గొన్నారు.

జిల్లా మహాసభలో మాట్లాడుతున్న వాణిశ్రీ

టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో

డీఎస్పీ తనిఖీలు

పోలీస్ స్టేషన్లో రికార్డులను తనిఖీ చేస్తున్న డిఎస్‌పి శ్రీనివాసమూర్తి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సాధారణ తనిఖీలో భాగంగా శనివారం చిత్తూరు 2వ పట్టణ పోలీస్ స్టేషన్‌ను డిఎస్పీ శ్రీనివాసమూర్తి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ స్టేషన్ సిబ్బంది, మహిళా పోలీసులతో మాట్లాడుతూ వారి ఉద్యోగభాద్యతలను వివరించారు. అలాగే ప్రజలతో ఎలా మెలగాలి అనే దానిపై పలు సూచనలు చేశారు. పట్టణంలో జరిగే భూతగాదాలు గురించి సమాచారం తెలుసుకొని వెంటనే ఎస్‌హెచ్‌ఓకి తెలపాలన్నారు. మహిళలపై జరిగే నేరాలపై, సైబర్ క్రైమ్ గురించి ప్రజలకు అవగాహన సదస్సుల ద్వారా అవగాహన కల్పించి ప్రజలను చైతన్యపరచాలని ఆదేశించారు. స్టేషన్‌లోని క్రైం రికార్డ్స్‌ను, కేసు డైరీ, రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. స్టేషన్‌లో వాహనాలను ఒకనెలలో వాటిని డిస్పోసే చేయాలన్నారు. అలాగే గతంలో చిత్తూరు పట్టణంలో సంచలనం రేపిన డ్రగ్స్ ముఠా అరెస్ట్ గురించి మరింత లోతుగా విచారణ జరపాలని అటువంటివి మరల పునరావతం కాకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు 2వ పట్టణ ఎస్‌ఐ మల్లికార్జున, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

భారీగా ఎర్రచందనం పట్టివేత

తొమ్మిది మంది కూలీలు అరెస్టు
47 దుంగలు, వాహనం స్వాధీనం

ప్రజాశక్తి- వికోట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మీదుగా తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్న భారీ ఎర్రచందనం దుంగలను శనివారం వీకోట పోలీసులు పట్టుకున్నారు. అన్నమయ్య జిల్లా సుండుపల్లి నుండి ఎర్రచందనం దుంగలను వి.కోట మీదుగా టాట 207 వాహనంలో అక్రమంగా తరలిస్తున్న తమిళనాడుకు చెందిన 9 మంది కూలీలను అరెస్టు చేసినట్లు పలమనేరు డీఎస్పీ సధాకర్ రెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ రిషాంత్ రెడ్డి ఆదేశాల మేరకు వి.కోట ఎస్సై రాంబూపాల్ నేతృత్వంలో పోలీసులు దానమయ్యగారిపల్లె వద్ద నాకాబందీ నిర్వహిస్తుండగా వచ్చిన వాహనం ఆపగా డ్రైవర్ పరారయ్యాడు. అందులో ఉన్న 9 మందిని అదుపులోకి తీసుకుని విచారించగా అక్రమ ఎర్రచందనం రవాణా బహిర్గతమైంది. వి.కోటకు చెందిన ప్రధాన స్మగ్లర్ తమిళనాడుకు చెందిన కూలీలను తరలించి సుండుపల్లె నుండి ఎర్రచందనాన్ని రహస్యంగా తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరికి తరలిస్తుండగా శనివారం తెల్లవారు జామున దానమయ్యగారిపల్లె వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఎర్రచందనం తరలిస్తున్న వాహనం పట్టుబడింది. ఇందులో తమిళనాడు రాష్ట్రం తిరువణామలై పరిసరాలకు చెందిన 1.దొరైస్వామి, 2.శంకర్, 3.రమన్, 4. సెల్వం, 5. తంగరాజ్, 6. ఏలుమలై, 7. ప్రకాష్, 8.మాసలమలై 9.సుబ్రమణిలుగా గుర్తించారు. నిందితుల వద్ద టన్ను బరువున్న రూ.50లక్షలు విలువ జేసే 46 ఎర్రచందనం దుంగలు, టాటా 207 వాహనాన్ని సీజ్ చేశారు. అనంతరం నిందితులను రిమాండుకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. అన్నమయ్య జిల్లా నుండి చిత్తూరు జిల్లా వి.కోట వరకు అధికారుల కంట పడకుండా ఇంత దూరం రావడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. మర్ని వివరాలు పోలీసులు దర్యాప్తులో తేలాల్సి ఉంది

బడుగు బలహీన వర్గాల అభివృద్ధే.. దేశ అభివృద్ధి..

సంక్షేమ బోర్డు సభ్యులు తురక నరసింహ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: బడుగు బలహీన వర్గాల అభివృద్దే దేశాభివృద్ధిని జాతీయ అభివృద్ధి సంక్షేమ బోర్డు కమిటీ మెంబర్ తురక నరసింహ తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా శనివారం ఉదయం డీఆర్ఓ సమావేశం హాల్‌లో డీఆర్ఓ, ఎన్.రాజశేఖర్, విద్య, వైద్యఆరోగ్య, గనులు భూగర్భ, స్త్రీశిశు సంక్షేమ, బిసి, ఎస్సి, ఎస్టీ సంక్షేమ శాఖల అధికారులతో కలసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడుగు బలహీన వర్గాలకు ఆములు పరిచే సంక్షేమ పథకాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివద్ధి కోసం జాతీయస్థాయిలో అభివద్ధి సంక్షేమం బోర్డును ఏర్పాటు చేయడం జరిగిందని అందులో చైర్మన్‌తోపాటుగా మెంబర్లు ఉంటారన్నారు. జిల్లాల పర్యటనలో భాగంగా జిల్లాలో బడుగు బలహీన వర్గాలకు కేంద్ర ప్రభుత్వం ఆములు పరిచే సంక్షేమ పథకాలు వారికి అందుతున్నాయి లేదని పరిశీలించడం, అధికారులతో సమావేశాలు నిర్వహించే సంక్షేమ పథకాలకు అర్హులైన వారందరికీ అందేలా చూడాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆములుపరిచే సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రభుత్వ కార్యాలయాలలో డిషప్లే చేయాలని సంబంధితా అధికారులకు సూచించారు. రాష్ట్ర, జిల్లాలోని గ్రామస్థాయిలో ఉన్న బిసిలోని ఉపకులాల వారిగా జనాభాను సేకరణ చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించిన కేంద్రం ప్రభుత్వం బడ్జెట్‌లో బీసీలకు ఎక్కువ బడ్జెట్ కేటాయించుటకు అవకాశం ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆములుపరిచే సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం బాగా ఉపయోగించుకుంటుందని తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, రాష్ట్రంలో ఇంగ్లీష్ మీడియంతో పాటు సీబీసీఎస్ సిలబస్‌తో పాఠశాలలో బోధిస్తున్నారని తెలిపారు. ఎనిమిది, తొమ్మిది, పది తరగతల విద్యార్థులకు ఫిజిక్స్, మ్యాథమెటిక్స్‌పై దష్టి సాధించి అనుభవం కలిగిన టీచర్స్‌తోపై ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులకు మంచి భవిష్యత్ కల్పించాలన్నారు. విద్యలో ఇంకా ఎలాంటి మార్పులు చేర్పులు చేయాలన్న విషయాలను అనుభవం కలిగిన ఉపాధ్యాయుల సలహాలు సూచనలు తీసుకొని కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని జిల్లావిద్యాశాఖ అధికారికి సూచించారు. డిఆర్ఓ ఎన్.రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరిచే సంక్షేమ పథకాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు అందించడం జరుగుతుందని, ఇంకా ఎవరికైనా ప్రభుత్వ పథకాలకు అర్హులుంటే అలాంటివారు స్పందన కార్యక్రమంలో అర్జీలు అందజేస్తున్నారని, వారి అర్జీలను పరిశీలించి అర్హులై ఉంటే వెంటనే సంబంధిత శాఖల ద్వారా వారికి పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. జాతీయ అభివద్ధి సంక్షేమ కమిటీ మెంబర్ సూచించిన సలహాలను సంబంధిత అధికారులు అమలుపరిచే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీవో రేణుక, జిల్లా విద్యాశాఖ అధికారి విజేంద్ర రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి, జిల్లా గిరిజన సంక్షేమ మరియు సాధికారత అధికారి ఏ. మూర్తి, ఎస్సీ, బీసీ, స్త్రీశిశు సంక్షేమ మరియు సాధికారత, భూగర్భగనులు శాఖాల అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్ అండ్‌బి అతిథి గహంలో బిసి, ఎస్సి సంఘాల నాయకులు జాతీయ అభివద్ధి సంక్షేమ బోర్డు కమిటీ మెంబర్ తురక నరసింహకు సమస్యల అర్జీలు అందజేసి శాలువతో సన్మానించారు.

అధికారులతో సమీక్షిస్తున్న జాతీయ సంక్షేమ బోర్డు సభ్యులు తురక నరసింహ

మైనారిటీల సంక్షేమానికి కృషి : డీఆర్‌ఓ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి కృషి చేస్తుందని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.రాజశేఖర్ తెలిపారు. శనివారం డిఆర్ఓ ఛాంబర్ వద్ద గల సమావేశపు మందిరంలో అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమం కొరకు ప్రధానమంత్రి నూతన 15 సూత్రాల కార్యక్రమ అమలు, మైనార్టీ సంక్షేమంపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం సంబంధిత శాఖల అధికారులతో మరియు మైనారిటీ నాయకులతో కలిసి జిల్లా రెవెన్యూ అధికారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే అన్నిసంక్షేమ పథకాలలో అర్హత మేరకు మైనారిటీలకు కూడా లబ్ధి చేకూరుతున్నదన్నారు. జగనన్న వసతిదీవెన, విద్యాదీవెన, ఉపకార వేతనాలు (కేంద్ర ప్రభుత్వ), తదితర అన్ని కార్యక్రమాల ద్వారా లబ్ధి చేకూర్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జగనన్న వసతిదీవెన కింద 2021- 22 ఆర్థిక సంవత్సరానికి గాను 6,981మందికి రూ.6.8కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. అలాగే జగనన్న విద్యాదీవెన కింద 2021 - 22 ఆర్థిక సంవత్సరానికి 8,127 మందికి రూ.12.05 కోట్లు మంజూరు చేయడమైనదని, కేంద్ర ప్రభుత్వం ద్వారా అందించే ఉపకార వేతనాలకు సంబంధించి 2021-22 ఆర్థిక సంవత్సరానికి గాను 26,050 మంది రూ.5.75 కోట్లు లక్షలు మంజూరు కావడం జరిగిందని తెలిపారు.

జిల్లాలో ఉన్న అన్ని మసీదులను రీసర్వే ద్వారా స్వమిత్వ (గ్రామకంఠం) సర్వేలో భాగంగా సర్వే చేయించాలని మైనారిటీ నాయకులు కోరగా ఈ రీ-సర్వే కార్యక్రమంలో భాగంగా గ్రామకంఠంలో అన్నింటిని సర్వే చేసి హద్దులు నిర్ణయించడం జరుగుతుందని తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్లు పాటిస్తూ మెరిట్ ప్రాతిపదికన అవుట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాన్ని గతంలో చేపట్టడం జరిగిందన్నారు. పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులందరికీ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతున్నదని, మైనార్టీలు ఎక్కువగా ఉన్న మున్సిపాలిటీ పరిధిలో గల స్లం ఏరియాలను అభివద్ధి చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. చిత్తూరు జిల్లా ప్రధాన ప్రభుత్వాసుపత్రిలో అంబులెన్స్ డ్రైవర్లు అధిక ధరలను డిమాండ్ చేస్తూ, ఆ ఆసుపత్రికి వచ్చే పేషెంట్లను ఇబ్బంది పెడుతున్నారని డిఆర్ఓ దష్టికి తీసుకురాగా, ఈ అంశంపై పోలీసు, వైద్యఆరోగ్యశాఖ వారు అంబులెన్స్ డ్రైవర్లతో సమన్వయ సమావేశం నిర్వహించి పేషంట్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని డిపిఎంకు సూచించారు. 2017-18 సంవత్సరానికి సంబంధించి మైనార్టీ విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు మంజూరు కాకపోవడంతో వారి సర్టిఫికెట్లను సంబంధిత కళాశాల యాజమాన్యం వారు ఇవ్వడం లేదని సభ దష్టికి మైనారిటీ నాయకులు తీసుకురాగా ఆ కళాశాల వివరాలను సేకరించి సర్టిఫికెట్లు అభ్యర్థులకు అందించేలా చర్యలు చేపట్టాలని జిల్లా మైనారిటీ అధికారి చిన్నారెడ్డికి డీఆర్ఓ సూచించారు. ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరికి ఉపాధి కల్పిస్తున్నామని, ఇప్పటి వరకు 3,38,000 పనిదినాలను కల్పించామని డ్వామా పిడి చంద్రశేఖర్ సభకు వివరించారు. డిఆర్‌డిఎ ద్వారా దీన్ దయాల్ ఉపాధ్యాయ ఉద్యోగ యోజన పథకం కింద 22మంది మైనారిటీలకు లబ్ధి చేకూర్చామని, జాబ్‌మేళాల ద్వారా 64 మందికి ఉపాధి కల్పించగా, బ్యాంకు లింకేజీలో 8శాతం, వైయస్సార్ సున్నా వడ్డీ పథకం కింద 4.8శాతం, స్త్రీనిధి పథకం కింద అప్లై చేసిన వారందరూ లబ్ధి పొందుతున్నారని, వైయస్సార్ చేయూత పథకం కింద అర్హులైన మైనారిటీ మహిళలకు లబ్ధి చేకూరిందని, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కింద 26మందికి లోన్లు మంజూరైందని డీఆర్డీఏ పిడి తులసి వివరించారు. విద్యాశాఖకు సంబంధించి అమ్మఒడి పథకం కింద అర్హులైన తల్లుల ఖాతాలోకి నగదు జమ అయ్యిందని, నాడు- నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను అభివద్ధి చేస్తున్నామని, జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందరికీ అందించామని జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్రరావు వివరించారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి వెంకట్రావు, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ పద్మజ, డిపిఎంఓ శ్రీనివాసరావు, కార్మికశాఖ, బిసి వెల్ఫేర్, ఇతర సంబంధిత అధికారులు, మైనారిటీ నాయకులు యూసఫ్, అఫ్జల్ ఖాన్, జాన్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం వద్దు

ఎటువంటి ఫిర్యాదులు లేకుండా వైద్య సేవలను అందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అన్ని సేవల్లోకల్లా వైద్యసేవ చాలా ముఖ్యమైనదని అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అర్హులైన వారందరికీ నాణ్యమైన వైద్యసేవలు అందించాలని భావించడం జరిగిందనిజిల్లా కలెక్టర్ ఎం. హరి నారాయణన్ అన్నారు. శనివారం చిత్తూరు ఉమ్మడి జిల్లాలో పలు వైద్యసంస్థలపై వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి విచారణ జరిపే కమిటీ సమావేశం కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఎన్నో వ్యాధులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురావడం జరిగిందని, వ్యాధిగ్రస్తులు ఆసుపత్రికి వచ్చినప్పుడు ఆ ఆసుపత్రుల్లో లభించే సేవలు ఆరోగ్య మిత్రాలు తెలపాలని, అదేవిధంగా అందే సేవలు గురించి డిస్ప్లే బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అన్నారు. వ్యాధిగ్రస్తులు వచ్చిన సమయంలో మొదటవారికి ట్రీట్మెంట్ ఇవ్వాలని వారి బంధువుల వద్ద నుంచి వారి వద్ద కావాల్సిన సమాచారం తీసుకునేటప్పుడు వారికి ఆరోగ్యశ్రీ ఉందా లేదా అని పరిశీలించాలన్నారు. ఆసుపత్రికి వచ్చినప్పుడు ఆసుపత్రిలోనూ తిరిగి డిశ్చార్జ్ చేసిన సమయంలో వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం చాలా ముఖ్యమని నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అదేవిధంగా ఆరోగ్యమిత్రాలు ఎప్పటికప్పుడు వారు ఆరోగ్యం గురించి పరిశీలించాలని ఆసుపత్రి సిబ్బంది బిల్లులకు సంబంధించి వెంటనే అప్లోడ్ చేయాల్సిన బాధ్యత ఉందని 104 లేదా ఐవిఆర్ఎస్ ద్వారా ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని అన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలో పలు వ్యాధులు రావడం జరిగిందని ఒకవేళ ఆ విధంగా లేని పరిస్థితుల్లో ఆ వ్యాధికి సంబంధించి చికిత్స ఉచితంగా అందించే ఆసుపత్రికి వ్యాధిగ్రస్తులను పంపించే ప్రయత్నం సకాలంలో చేయాలన్నారు. ఫిర్యాదులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీపై ఉందని నాణ్యమైన వైద్యం అందించే దిశగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యం సాధించేందుకు అందరూ కషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీహరి, జిల్లా ఆరోగ్యశ్రీ అధికారి డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డిసిహెచ్ఎస్ ఇతర ఆసుపత్రుల సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

లారీలో విద్యార్థుల తరలింపు

ఉపాధ్యాయులపై మండిపడ్డ స్థానికులు

ప్రజాశక్తి- వికోట

గంగవరం మండలం పొన్నూమకూనపల్లికి చెందిన ప్రభుత్వపాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయులు లారీలో కుప్పం నియోజకవర్గం గుడిపల్లి దగ్గర ఉన్న అగస్త్య సైన్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌కు తరలించిన వైనం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు ప్రభుత్వ పాఠశాల పిల్లలంటే అంత అలుసా పశువులను తరలించే విధంగా పిల్లలను తరలిస్తున్నారంటూ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల తీరుపట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పోన్నమాకనపల్లి తెలుగు టీచర్ మనోహర్ ప్రభుత్వ ఉపాధ్యాయుడై ఉండి ఇంతదూరం మోతాదుకు మించి విద్యార్థులను ఎక్కించి తరలించడం దారుణమని, ఈ విషయంపై జిల్లా అధికారులు దష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులను లారీలో తరలిస్తున్న దృశ్యం

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించండి

ప్రజాశక్తి -యాదమరి: గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులకు, చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని యాదమరి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వేణుగోపాలపురం, బండి వాండ్ల ఊరు గ్రామాల్లో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన గర్భిణులకు ఇచ్చిన యాంటినేటల్ కార్డులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మేల్ హెల్త్ అసిస్టెంట్ సురేంద్ర నాథ రెడ్డి, ఎం ఎల్ హెచ్ పి లోకేశ్వరి, మహిళా ఆరోగ్య కార్యకర్తలు భాగ్యమేరి, జ్యోతి, ఆశా కార్యకర్తలు ధనలక్ష్మి, గౌతమి, చిన్నారుల తల్లులు, గర్భవతులు తదితరులు ఉన్నారు.

'విధ్వంసకర ప్రభుత్వాన్ని ప్రజలే సాగనంపుతారు'

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: మూడేళ్ల వైసిపి పాలనలో ప్రభుత్వ, ప్రతిపక్షాల, ప్రజలకు సంబంధించిన ఆస్తులను విధ్వంసం చేసే సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలే సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గంగాధర నెల్లూరు, పెనుమూరు మండలాల టిడిపి అధ్యక్షులు స్వామిదాస్, రుద్రయ్య నాయుడు, పార్లమెంట్ టిడిపి కార్యదర్శి తలారి రెడ్డప్ప, జిల్లా టిడిపి బీసీసెల్ మాజీ కార్యదర్శి నటరాజ్ మొదలి ధ్వజమెత్తారు. పెనుమూరు మండలానికి చెందిన టిడిపి అధ్యక్షులు రుద్రయ్య నాయుడు, అదే విధంగా గుత్తవాండ్ల ఊరు గ్రామానికి చెందిన కరుణ చౌదరిలు పుట్టినరోజు సందర్భంగా శనివారం వారిరువురు కలిసి అన్న క్యాంటీన్లో పేద వర్గాల ప్రజలకు సుమారు 200 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుధాకర్ నాయుడు, భాస్కర్, బుజ్జి బాబు, జాన్, ప్రకాష్, శంకర్, పాండు పాల్గొన్నారు

స్పర్శ లేని మచ్చలు ఉంటే చెప్పండి

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: ఆస్పత్రి పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు స్పర్శ లేని మచ్చలు ఉంటే వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలని ఏపీఎం ఓ.క్రిష్ణ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పాపిరెడ్డి పల్లి పంచాయతీ మారేడుపల్లి గ్రామంలో ఎల్సిడిసి గురించి వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధిని ప్రారంభదశలోనే గుర్తిస్తే అలాంటివారు అంగవైకల్యానికి గురికాకుండా వైద్య సేవల ద్వారా నిర్మూలించవచ్చని పేర్కొన్నారు. సూపర్వైజర్ ధర్మేంద్ర, ఏఎన్ఎం హేమలత, పలువురు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బ్యూటిషియన్ కోర్సు ప్రారంభం

ప్రజాశక్తి- కార్వేటినగరం : రాష్ట్రీయ సేవా సమితి (రాస్) మహిళా పొదుపు సంఘాల సభ్యుల సౌకర్యార్థం జన్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర సంఘాల కార్యాలయంలో ఉచిత బ్యూటిషియన్ కోర్స్ ప్రారంభించారు. 20 మంది మహిళలకు ప్రతిరోజు మూడు గంటల పాటు బ్యూటీషియన్ సంబంధించిన అంశాలను నేర్పిస్తున్నామని జెఎస్ఎస్ అధికారి సుధాకర్ తెలిపారు. ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ రాస్ పొదుపు సంఘాల సభ్యులకు ఆర్థిక రుణాలతో పాటు, ఆరోగ్య కార్యక్రమాలు పిల్లలకు, మహిళలకు ఆరోగ్య చిట్కాలు, చేతి వృత్తుల వంటివి రాస్ సంస్థ ద్వారా అందిస్తున్నామని ఈ అవకాశాన్ని సద్విని చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాస్ అధికారులు సిపి అన్బలగన్, ధనలక్ష్మి, చంద్రకళ, బాలమ్మ నాగమణి, నిర్మలమ్మ పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యాన్ని వీడండి

తహశీల్దార్ బెన్నురాజు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యాన్ని వీడాలని తహశీల్దార్ బెన్నురాజ అన్నారు. శనివారం మండలంలోని గుంతూరు సచివాలయం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించకుండా సమస్యలను అలానే ఉంచారని, సిబ్బంది హాజరు శాతం పట్టికను పరిశీలించి సచివాలయ డిజిటల్ అసిస్టెంట్, వీఆర్వో విధుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులు లేక వారి సొంత పనుల కోసం వెళ్లినట్టు గ్రహించి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి తెలిపారు. స్పందనకొచ్చిన సమస్యలను సకాలంలో పరిష్కరించకుండా ఉండడం వలన అధికారుల నిర్లక్ష్యం తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

-ఎంపీపీ లతబాలాజీ

ప్రజాశక్తి- కార్వేటినగరం : స్వచ్ఛతా సేవలో గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. శనివారం కార్వేటినగరం పంచాయతీ కార్యాలయంలో స్వచ్ఛత సేవా కార్యక్రమాన్ని సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు కూడా వ్యర్థలను వీధుల్లో వేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు అందించి పంచాయతీకి సహకరించాలన్నారు. మురుగునిటి కాలువల్లో చెత్త వేయడం వలన మురుగునీరు నిల్వచేరి రోగలు వచ్చే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా వాలంటీర్లు ప్రజలకు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎంపీడీవో మోహన్ మురళి, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -పలమనేరు : ఏపీ మెడికల్ ఎంప్లాయ్ యూనియన్ సర్వ సభ్య సమావేశం ఏరియా హాస్పిటల్లో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.గిరిబాబు జిల్లా అధ్యక్షుడు కే.వెంకటేష్ జిల్లా కోశాధికారి, ఏ.రాధ హాజరై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిలో అధ్యక్షులుగా డి.విజయ్‌కుమార్, హెడ్ నర్స్, కార్యదర్శిగా సుకుమారి, ఎస్ఎన్ కోశాధికారిగా ఎన్. లీలావతి, ఉపాధ్యక్షులుగా జయశ్రీ, ఎల్.టి.ఎ రామకృష్ణమ్మ, సీ.ఎన్. ఎం రెడ్డి రాజేష్ అసిస్టెంట్, సంయుక్త కార్యదర్శి లు ఎమ్మార్ గోపాల్, ఎస్ ఆనంద్, అంబికా, కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు.

తిరుచానూరు కార్తీక బ్రహ్మోత్సవాలకు..

ఏడు టన్నుల కూరగాయల వితరణ

ప్రజాశక్తి -పలమనేరు: తమిళనాడు రాష్ట్రం బాగులూరు నుండి తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన భక్తుల ప్రసాద వినియోగం కోసం పలమనేరు కాపు పల్లి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో గోపాల్ రెడ్డి శ్రీకాంత్ సహకారంతో ఏడు టన్నుల కూరగాయలను తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలకు శనివారం తరలించారు. ఈ కార్యక్రమంలో పలమనేరుకు చెందిన బాబు,రైతులు పాల్గొన్నారు

మైనర్లకు వాహనాలు ఇవ్వకండి

సిఐ నరసింహారెడ్డి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మైనర్లకు వాహనాలు ఇవ్వకండని సీఐ నరసింహారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సంక్రాంతి పల్లి పంచాయతీ మిట్టపల్లి గ్రామంలో అవగాహన సదస్సు జరిగింది. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనం నడపరాదని గ్రామాల్లో నూతన వ్యక్తులు సంచరిస్తే వారి సమాచారాన్ని పోలీసులకు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, హెడ్ కానిస్టేబుల్ గజేంద్ర, గ్రామస్తులు కన్నయ్య, లోకనాథం, పలువురు డ్వాక్రా మహిళలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వాడాలి

ప్రజాశక్తి-సోమల : ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన సోమల మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామాలలో ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వచ్ఛతా రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలో ఎంపీడీవో నాగరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ ప్రభాకర్, సచివాలయ సిబ్బంది ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు బస్టాండ్ కూడలి నుండి స్వచ్ఛతరన్ ప్రారంభించి పరుగులు తీశారు. అంతకుముందు బస్టాండ్ కూడలిలోని గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మరుగుదొడ్లను వినియోగించి వాతావరణ కాలుష్యాన్ని ప్రజారోగ్యాన్ని కాపాడాలని నినాదాలు చేశారు. కందూరు గ్రామంలో సర్పంచ్ భాషా మసూద్ ఎంపీపీ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులచే స్వచ్ఛతారన్ కార్యక్రమాన్ని నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సోమలలో..

సోమల: మండల కేంద్రమైన సదుం బస్టాండ్‌లో సచివాలయ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ పరిశుభ్రత దినోత్సవం, మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వాడాలన్నారు.

పులిచెర్ల: పరిసరాలు పరిశుభ్రత మనందరి బాధ్యతని సర్పంచ్ షుకూర్, ఈఓ యుగంధర్, ఎంపీటీసీ రెడ్డి అహ్మద్ తెలిపారు. కల్లూరు పంచాయతీలో శనివారం జగనన్న స్వచ్ఛత రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వచ్ఛతపై ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ షుకూర్,

ఎస్ఆర్‌పురంలో..

ఎంపీటీసీ రెడ్డి అహ్మద్ మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నాయకులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పురం: మండలంలోని తయ్యూరు గ్రామ పంచాయతీలో పెద్దతయురు గ్రామంలోజగనన్న స్వచ్ఛ సంకల్పపై ర్యాలీ నిర్వహించారు పరిశుద్ధతలో భాగంగా గ్రామాల్లో స్వచ్ఛత పరిశుభ్రత మెరుగుపరచడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్వచ్ఛ సంకల్ప పథకం తీసుకొచ్చారని తయ్యురు సర్పంచ్ వరదమ్మ అన్నారు. గ్రామస్తులుకు పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి జోష్ణ, అమర్నాథ్, నాయకులు జనార్ధన్ మాజీ సర్పంచ్ బాబు, మణి, నారాయణస్వామి మధు, సచివాల సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్వాడి సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు జ్ఞానం పెంచుతాయి

ప్రజాశక్తి- కార్వేటినగరం : విద్యార్థులతో పాటు గ్రామ పెద్దలు గ్రంథాలయాలకు వచ్చి వివిధ రకాలైన పుస్తకాలను చదవడంతో జ్ఞానం పెంచుకోవచ్చని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. శనివారం గ్రంథాలయ వారోత్సవ ముగింపు కార్యక్రమంలో భాగంగా వ్యాసరచన, పాటలపోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు మెమెంటోలను అందించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా " విజయులు రెడ్డి, ఎంపీడీవో మోహన్‌లను గ్రంథాలు అధికారి శంకర్ బాబు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధనంజయ వర్మ, ఎంఈఓ విజయ్ కుమార్, జనార్ధన్, రమ్య, రాఘవేంద్ర రాజు,విద్యార్థులు పాల్గొన్నారు.

సోమల : జిల్లాలో గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయాల ఛైర్మన్ మధుబాల తెలిపారు. శనివారం సోమలలోని గ్రంథాలయాన్ని ఆమె సందర్శించి ప్రజా ప్రతినిధులు గ్రామస్తులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ గ్రంథాలయాలలో ఉన్న ఎంతో విలువైన పుస్తకాలను ప్రతి ఒక్కరూ చదవడం

వల్ల లోకజ్ఞానం తెలుస్తుందని ముఖ్యంగా ఈ కాలం పిల్లలు సెల్ ఫోన్‌లకు బానిసలు కాకుండా పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయం గురించి విద్యార్థులకు తెలియజేశారు. గ్రంథాలయ అధికారి రామకృష్ణ, మాజీ సర్పంచి శ్రీరాములు, విశ్రాంత ఉపాధ్యాయులు పార్థసారథి, కోటేశ్వరయ్య, వైసిపి నాయకులు వరదం వెంకటరమణ, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

శాంతిపురం: 55వ జాతమ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శాంతీపురం కెజిబివి పాఠశాల లో దిశచట్టం, మహిళా సాధికారత అనే అంశాలపై ఎంఈవో అధ్యక్షతన వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీలో గెలుపు పొందిన వారికి బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, శాంతిపురం సచివాలయం మహిళా పోలీస్, గ్రంథాలయాధికారిణి పాల్గన్నారు.

యాదమరి: వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారి రుక్మిణి బహుమతులు ప్రదానం చేశారు. శనివారం యాదమరి గ్రంథాలయ 55వ జాతీయ వారోత్సవాలు ముగింపు సమావేశం జిల్లా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరి రాజా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. హెచ్ఎం భాస్కరరావు, ఆర్ట్ మాస్టర్ దామోదర చారి, సర్పంచ్ యూన్సీ పళని, ఉపసర్పంచ్ బాలాజీ, సిఆర్పిలు సికె బాబు విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

వెదురుకుప్పం : మండలంలోని చవటగుంటలో "రోల్ ఆఫ్ లైబ్రరీ ఇన్ లెర్నింగ్ అండ్ టీచింగ్ ఇన్ డిజిటల్ ఎన్విరాన్మెంట్" అనే అంశంపై డా వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సదస్సును నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా ఎస్వీ యూనివ్సిటీ గ్రంథాలయ, సమాచార శాఖ విశ్రాంత ఆచార్యులు డా.వి.పుల్లా రెడ్డిని కళాశాల వారు ఆహ్వానించారు. సభకు అధ్యక్షులుగా కళాశాల ప్రిన్సిపాల్ డా.బి. అన్నపూర్ణ శారద మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో పుస్తకం పాత్రను విద్యార్థులకు వివరించారు. ఈ సదస్సులో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చంద్రబాబు.. ప్రభుత్వంపై బురద చల్లడం మానుకో..

పూతలపట్టు శాసనసభ్యులు ఎమ్మెస్ బాబు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: చంద్రబాబు నాయుడు.. ప్రభుత్వంపై బురద చల్లడం మానుకోవాలని పూతలపట్టు శాసనసభ్యులు ఎమ్మెస్ బాబు అన్నారు. శనివారం ఎమ్మెల్యే కార్యాలయంలో పత్రిక విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్నూల్ సమావేశంలో చంద్రబాబు నాయుడు దత్తపుత్రుడు వ్యాఖ్యలను చూస్తుంటే దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ గుర్తుకొస్తున్నాడని ఇద్దరు కలిసినప్పటి నుంచి బూతు మాటలు ఎక్కువయ్యాయన్నారు. ముఖ్యమంత్రిపై విమర్శలు చేస్తే సహించేది లేదని మూడు రాజధానుల విషయంలో చంద్రబాబు మాట్లాడుతున్న తీరును చూస్తుంటే బాధాకరంగా ఉందన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ఎప్పుడు కూడా ఇలాంటి వ్యాఖ్యలు చేయలేదని ఆయన వ్యాఖ్యాలను చూస్తుంటే ఆశ్చర్యానికి గురవుతున్నామన్నారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా ఉండి రాయలసీమ అభివృద్ధికి సహకరించడం

లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ముందు చూపుతో రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలని ఆలోచనతో మూడు రాజధానులు ఏర్పాటుకు చర్యలు చేపడుతుంటే చంద్రబాబు అడ్డుకునే ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఐరాల పూతలపట్టు కన్వీనర్ బుచ్చిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, బంగారుపాళ్యం జడ్పిటిసి సోము, తవణంపల్లి ఎంపీపీ హరి రెడ్డి వైస్ ఎంపీపీ పట్నం ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సు ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం

ప్రజాశక్తి- పాలసముద్రం: మండలంలోని వనదుర్గాపురం పంచాయతీ ఎన్నో ఏళ్లుగా బస్ సౌకర్యం లేకపోవడంతో ప్రస్తుతం బస్ సర్వీస్ నడపడానికి రోడ్డుకి ఇరుపక్కల ఉన్న చెట్లు, ముండ్ల పొదలు తొలగించి, బస్సు ప్రారంభోత్సవానికి శనివారం ముమ్మరంగా పనులు సర్పంచ్ నరసింహ రాజు చేపట్టారు. ఈ పంచాయతీకి ఎన్నో ఏళుగా బస్సు రాకపోవడంతో ప్రజలు, గ్రామస్తులు ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం డిప్యూటీ సీఎం కే.నారాయణస్వామి, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానంద రెడ్డి చొరవతో వనదుర్గాపురం పంచాయతీకి బస్సు సౌకర్యం ఆర్టీసీ అధికారులకు ఆదేశించారు. వారు రెండు రోజుల క్రితం వచ్చి రోడ్ సర్వే చేపట్టారు. రోడ్ సర్వేలో ఆర్టీసీ అధికారులు మీ పంచాయతీకి బస్సు రావాలంటే రోడ్డుకి ఇరుపక్కల ఉన్న చిన్న చిన్న ముళ్ళపదులు చెట్లు తొలగించి రోడ్లు వెడల్పు చేయాలని సూచించారు. అందుకు అనుగుణంగా

బస్సు ప్రారంభోత్సవానికి మరమ్మతులు చేస్తున్న పనులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

రెండు రోజులు శరవేగంగా రోడ్డు మరమ్మతు పనులు చేస్తున్నారు. రోడ్డు మరమ్మతు పనులను జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఆర్బికే ఛైర్మన్ పోలయ్య గురుప్రసాద్, సిద్ధమండడి, పెద్ద వరదరాజు, వరదరాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ పురుషుల దినోత్సవం

ప్రజాశక్తి -యాదమరి: అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాలలో మహిళ టీచర్స్ శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో పనిచేస్తున్న టీచర్స్ ప్రధానో పాధ్యాయులు రమేష్ బాబు, కనకాచారి, మదన్ మోహన్ రెడ్డి, నరసింహారెడ్డి, మురళీధరన్, మహేష్, షణ్మగం, చిన్నదొరై, దామోదర్, భోదనేతర సిబ్బంది, భాష, గాంధి, ఇంకా, సీఆర్పీలు, వాలంటీర్ దినేష్ లను మహిళ టీచర్లు సన్మానించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పద్మ, వాణి, భారతి, అరుణ, ఉష, భారతి, విష్ణు ప్రియ, మంజులత, ఆక్తర్ పాల్గొన్నారు.

సోమల: మండల కేంద్రమైన సదుం జ్యోతిరావు పూలే గురుకుల కళాశాలలో ఘనంగా పురుషుల దినోత్సవం

నిర్వహించారు. కళాశాలలోని మహిళ అధ్యాపకులు పురుషులకు సన్మానం చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అంతకుముందు కేక్ కట్ చేసి పురుష అధ్యాపకులకు తినిపించారు. హారతి, హేమావతి, కుసుమ, రాధా, హేమలత, పద్మావతి, సునీత, సుజాత, నాగవేణి, అనీషా, కుసుమ పాల్గొన్నారు.

రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శిక్షణ

జిల్లా శిక్షణ కేంద్రం సహాయకులు గోపాల్‌రావు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని చప్పిడిపల్లి గ్రామంలో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రంలో ఆత్మ (వ్యవసాయ సాంకేతిక సంస్థ)వారి ఆధ్వర్యంలో డిఆర్సీ (జిల్లా శిక్షణ కేంద్రం) సహాయ సంచాలకులు గోపాల్ రావు అధ్యక్షతన రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా గోపాల్ రావు మాట్లాడుతూ రైతులు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలన్నారు. అలాగే అధిక దిగుబడులను ఇచ్చే రకాలను నాటుకోవాలన్నారు. విత్తనాలు, నారులు నాటే ముందు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలని తద్వారా వేరుకుళ్లు తెగుళ్లు నివరించుకోవచ్చునని అన్నారు. అలాగే వరి వేసే రైతులు డ్రమ్ సీడర్ ద్వారా వరి నాటుకోవాలని తద్వారా ఖర్చు తగ్గించు

రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారులు

కోవచ్చునన్నారు. అనంతరం మండల వ్యవసాయాధికారి మునికృష్ణ మాట్లాడుతూ వేరుశనగలో సస్యరక్షణ చర్యల గురించి, విత్తన శుద్ధికి ట్రైకోడర్మ వీరిడి వాడాలన్నారు. అలాగే పంటల వారిగా ఆర్బికె సహాయకులు నిర్వహించే పొలంబడి కార్యక్రమలలో పాల్గొని పంటల విధానం గురించి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయ ఉద్యాన సహాయకుడు రాజు, రైతులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - గంగవరం: డిప్లొమా ఇన్ అనిమల్ హస్బెండరీ కళాశాల, శ్రీ వెంకటేశ్వర వెటరినరీ యూనివర్సిటీ వారి ఆధ్వర్యంలో శనివారం పశువైద్య శిబిరాన్ని గంగవరం మండలంలో గ్రామీన పశువైద్యకేంద్రం, గండ్రాజూపల్లి పరిధిలోని మర్రిమాకులపల్లె గ్రామంలో పశువులకు డిటికింగ్ (200), డీవర్మింగ్ (40), గర్భకోశ వ్యాధులకు (25) చికిత్స చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. సుబ్బమ్మ, పలమనేరు పశు వైద్యశాల సహాయ సంచాలకులు డా. మోహన్ రవి కుమార్, పశు వైద్య కేంద్రం గంగవరం డా. కల్పన, గ్రామీన పశు వైద్య కేంద్రం, గండ్రాజూపల్లి జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ అనురాధ, పశు గణన సహాయకులు ప్రవీణ్ కుమార్, భాస్కర్, కళాశాల విద్యార్థుల హాజరయ్యారు.

ఓటర్ నమోదుపై అవగాహన

ప్రజాశక్తి -వెదురుకుప్పం : డిగ్రీ కళాశాలలో 18 సంవత్సరాల పూర్తయిన విద్యార్థిని విద్యార్థులకు ఎలక్ట్రోల్ రోల్స్ చేసుకొనేందుకు అవసరమైన అవగాహన సదస్సును నిర్వహించారు. శనివారం డాక్టర్ వైయస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద అధ్యక్షతన వెదురుకుప్పం తహశీల్దార్ పుల్లారెడ్డిచే ఓటర్ ఎన్రోల్ గురించి తెలియజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ బి అన్నపూర్ణ శారదచే వెదురుకుప్పం తహశీల్దార్ పుల్లారెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఇందులో అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాలు పంపిణీ..!

రామకుప్పం: రైతుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ డ్రిప్ పరికరాలు సబ్సిడీ ద్వారా అందించడం జరుగుతుందని రైతు భరోసాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం మండల పరిధిలోని కెంచన బల్ల గ్రామపంచాయతీలో సర్పంచ్ సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ చలపతి డ్రిప్ పరికరాలను రైతులకు అందించారు. ఈ అవకాశాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బిందు సేద్యం పరికరాలు...

ప్రజాశక్తి -పలమనేరు : పలమనేరు మండల పరిధిలోని కూర్మయి గ్రామంలో ఆర్‌బి కే ద్వారా జైన్ కంపెనీ బిందు, తుంపర్ల సేద్యం పరికరాలు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్బికే ప్రతినిధి స్పందన మాట్లాడుతూ... డ్రిప్ పరికరాలు కావల్సిన రైతులు ఆర్‌బికె సెంటర్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైన కంపెనీ ప్రతినిధులు మురళి, మహేశ్ పాల్గొన్నారు.

పోలీసు లాంఛనాలతో నివాళి

ప్రజాశక్తి - వెదురుకుప్పం: మండలంలోని ఎగువ పల్లాలు గ్రామానికి చెందిన హిమాచలపతి రెడ్డి విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. హిమాచలపతి రెడ్డి (బిఎస్ఎఫ్ జవాన్) విధులు నిర్వహించి పదవీ విరమణ పొందాడు. విషయం తెలుసుకున్న బిఎస్ఎఫ్ ఎస్ఐ తిమ్మారెడ్డి, జవాన్లు ప్రసాద్, రాకేష్, రామచంద్రా రెడ్డి తదితరులు శనివారం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సైనిక వందనం చేశారు.

తహశీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో తనిఖీ

ప్రజాశక్తి-పెద్దపంజాణి: పలమనేరు రెవిన్యూ డివిజనల్ అధికారి జి.రామకృష్ణారెడ్డి పెద్దపంజాణి తహశీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆన్లైన్లో రైతులు పాసు పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకున్న

7 అప్లికేషన్లు తహశీల్దార్ కార్యాలయంలో పెండింగ్లో ఉన్నందున వాటి వివరాలను తహశీల్దార్ హనుమంతును అడిగి తెలుసుకున్నారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు దరఖాస్తు చేసుకుంటే వాటిని వెంటనే పరిశీలించి పాస్ పుస్తకాలు మంజూరు చేయాలన్నారు. రిజెక్ట్ చేసిన దరఖాస్తులను సరైన కారణాలతో సంబంధిత అర్జీదారులకు తెలియజేయాలని స్థానిక వీఆర్వోలకు సూచించారు. అలాగే గ్రామస్తులు రైతులు సచివాలయాలకు వస్తే విఆర్ఓ చెబితే ఆన్లైన్ చేస్తామనే విషయాలు డిజిటల్ అసిస్టెంట్ చెప్పకూడదని అలా చెబితే ఇద్దరిపైనా చర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించారు. వీఆర్వోలు ఏ రకమైన అర్జీలు వచ్చినా ఆర్జీలను, పుస్తకాల్లో రాసి రికార్డు రూపంలో భద్రపరచాలన్నారు. ఆన్లైన్లో ప్రజలు పెట్టుకున్న అర్జీలను గడువులోపు పరిష్కరించాలని అదేవిధంగా అర్జీలను పరిష్కరించే చివరి రోజు రిజెక్ట్ చేస్తే దానికి కారణం సంబంధిత అధికారులు అందరూ బాధ్యత వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హనుమంత, డిప్యూటీ తాసిల్దార్ ఫణి కుమార్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ దాసిన గ్రామ రెవెన్యూ అధికారులు వెంకటేష్, ఉమా శంకర్, శివకుమార్,శ్రీనివాసులు సర్వేర్ ఆంజనేయులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన తహశీల్దార్

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి : మండలంలోని లక్కనపల్లి గ్రామ పంచాయతీ సచివాలయాన్ని మండల తహశీల్దార్ కుమాం స్వామి శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా రికార్డు తనిఖీ చేసి

హాజరు పట్టికను పరిశీలించి సచివాలయం పరిధిలో ఉన్న సిబ్బందికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఇక్కడకు వచ్చిన ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోని వారి ఉద్యోగాన్ని గుర్తించుకొని వారు బాధ్యతగా పని చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, వీఆర్వో వెంకటేష్ ముఖ్యంగా సచివాలయ సిబ్బందిని పర్యవేక్షిస్తూ తగు చర్యలు చేపట్టి సచివాలయానికి వచ్చే ప్రతి ఒక్కరి సమస్య సకాలంలో పూర్తిస్థాయిలో తగు న్యాయం చేసే విధంగా చూసుకోవాలని తగు సూచనలు జారీ చేశారు.

ఏనుగుల దాడిలో మామిడి తోట ధ్వంసం

ప్రజాశక్తి-సోమల : సదుం మండలంలోని జోగివారిపల్లి పంచాయతీలో శుక్రవారం అర్ధరాత్రి ఏనుగుల మంద రైతుల పంట పొలాలపై దాడులు చేసి మామిడి మొక్కలు, బిందు సేద్యం పరికరాలను ధ్వంసం చేశాయి. ఐరాల బండ సమీపంలో బత్తల వారి పల్లెకు చెందిన బాబు రెడ్డి అనే రైతు మామిడి తోటలో అర్ధరాత్రి 10 ఏనుగుల మంద దాడి చేసి దాదాపు 50 మామిడి చెట్ల కొమ్మలను

విరిచేశాయి. బిందు సేద్యం పరికరాలను, పైపులను పూర్తిగా ధ్వంసం చేయడంతో దాదాపు లక్ష రూపాయల మేర నష్టం వాటిల్లినట్టు రైతులు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఏనుగుల భారీ నుండి రైతులను, పంటపొలాలను కాపాడాలని ప్రజలు రైతులు కోరుతున్నారు.

ప్రజాసమస్యలను తీర్చడమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-రొంపిచర్ల : మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.8కోట్లతో రెండు లో ఓల్టేజ్ సబ్ స్టేషన్లను, మరో రెండు నెలల్లో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. మండలంలో ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొని రావాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు దేవులపల్లి హరినాథరెడ్డి, వైస్ ఎంపీపీలు విజయశేఖర్, నూలు రెడ్డెప్ప, ఎంపీడీఓ రాజేంద్ర, సర్పంచ్ లు ఇబ్రహీం ఖాన్, నాగిరెడ్డి, ప్రసాద్ నాయుడు, అన్సర్ బాషా, సుధారాణి, రమణయ్య, హేమలత జీవలత, వైఎస్సార్సీపీ నాయకులు చెంచురెడ్డి, డాక్టర్ శ్రీనాథ్, సూర్యనారాయణ రెడ్డి, కమలాకర్ రెడ్డి, కోటా వెంకటరమణ, యుగంధర్ రెడ్డి, హరిక్రిష్ణా రెడ్డి, శ్రీనాథ నాయుడు, బాబు, ఉమాపతి రెడ్డి, భాస్కర్ రెడ్డి మండల స్థాయి అధికారులు,పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజంలో ఆడ,మగ సమతుల్యాన్ని సాధిద్దాం

రెవెన్యూ డివిజనల్ అధికారి రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి -పలమనేరు: గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఒక్కరికి చట్టం పట్ల అవగాహన కల్పించి ఆడపిల్లల సంఖ్యను పెంచి సమాజంలో ఆడ, మగ సమతుల్యాన్ని సాధిద్దామని పలమనేరు రెవెన్యూ డివిజనల్ అధికారి రామకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం పలమనేరు రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పిసిపిఎన్‌డిటి యాక్టు 1994 నియోజకవర్గ కమిటీ సమీక్ష సమావేశం కన్వీనర్ డాక్టర్ సుదర్శన్ డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.... లింగ వివక్షతకు, స్త్రీలు సమాజంలో మోసపోకుండా అవగాహన కల్గించాలని , ప్రతి స్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ నిషేధమనే బోర్డ్స్, గర్భ స్రావం చేసుకొనే వివరాలు రిజిస్టర్లు నిర్వహించాలని సూచించారు. డాక్టర్ మల్లికార్జునరెడ్డి, డీజీఓ డాక్టర్ వీణాకుమారి, డాక్టర్ శ్యామల దేవి, ప్రైవేట్ నర్సింగ్ హోమ్ డాక్టర్స్,జిల్లా అధికారులు శ్రీవాణి, గాంధీ రెడ్డి , జన వికాస సంస్థ నిర్వాహకులు ప్రమీల తో పాటు స్వచ్ఛంద సంస్థ అధినేతలు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కళామందిరంలో పురస్కారాల ప్రదానోత్సవం

ప్రజాశక్తి -పలమనేరు: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కళామందిరంలో ఆదివారం శివేగారి దేవమ్మ కథా-పురస్కారం, బాపురం గురురాజూరావు కవితా పురస్కారాల ప్రదానోత్సవం జరుగుతుందని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు పి. తులసినాథం నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రాచపాళెం చంద్రశేఖరెడ్డి, కవి యాకూబ్ హాజరు కానున్నారని తెలిపారు. అనంతపురంకు చెందిన బాపురం నరహరి రావు, పలమనేరుకు చెందిన మేఘనాథరెడ్డిలు నిర్వహిస్తారన్నారని తెలిపారు.

పల్లకిపై శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి

ప్రజాశక్తి-సోమల : మండలంలోని నెల్లిమంద పంచాయతీ బురుజుపల్లి గ్రామంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో షష్టమ(ఆరవ) వార్షికోత్సవ కళ్యాణోత్సవ కార్యక్రమంలో భాగంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. కళ్యాణోత్సవం అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పూల పల్లకిపై ఆసీనులను చేసి గ్రామంలో ఊరేగించగా భక్తులు మహిళలు స్వామివారికి మంగళ హారతులు పట్టారు. కాగా పల్లకి సేవ ముందు భజన బృందాల వారు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ గ్రామోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

బహిరంగ ప్రకటన

ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా **శ్రీమతి పి.శకుంతల,W/o** పి.గోపినాధ రెడ్డి, ఆత్మకూరు గ్రామం, ఎన్.ఆర్.పేట పోస్టు, గంగాధరనెల్లూరు మండలం,చిత్తూరు జిల్లా అనువారు లోను నిమిత్తం నా క్లైయింట్ బ్యాంకు **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,చిత్తూరు శాఖను** సంప్రదించి ఉన్నారు. అందుకు గాను ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని అడమానం పెట్టదలిచారు.కావున క్రింది షెడ్యూలు దాఖల ఆస్తి పై ఎవరికైనా ఏ విధమైన హక్కులు గాని, అడమానములు, అగ్రిమెంట్లు, క్లైయిములు, కోర్టు అటాచ్ మెంట్లు, ఇంకేదైనా అభ్యంతరములు ఉన్న యెడల ఈ దినము నుండి 10 రోజుల లోపు నాకు గాని లేక పై తెలిపిన బ్యాంకుకు గాని వ్రాత పూర్వకముగా తెలుప వలసినదిగా కోరడమైనది.ఆ తర్వాతి క్లైయిములకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, చిత్తూరు శాఖ బాధ్యత వహించదు.

షెడ్యూలు : చిత్తూరు జిల్లా -చిత్తూరు రూరల్ ఉప జిల్లా - గంగాధరనెల్లూరు మండలం,ఆత్మకూరు గ్రామ పంచాయితీ, ఆత్మకూరు గ్రామం లెక్క దాఖలా ఆత్మకూరు గ్రామ కంఠం సర్వే నెంబరు 171-1 గల భూమి లో ఆత్మకూరు గ్రామంలో ఈ క్రింది చెక్కుబంది మధ్య గల ఖాళీ జాగా

తూర్పు : విజయకుమార్ రెడ్డి గారి ఇల్లు,పడమర :సుబ్రమణ్యం నాయుడు గారి ఇల్లు,ఉత్తరం : రాజ వీధి, దక్షిణం : రామచంద్రారెడ్డి గారి ఇల్లు.

ఈ మధ్య తూర్పు పడమర 21 1/2 అడుగులు, ఉత్తరం దక్షిణం : 24 1/2 అడుగులు.మొత్తం 526.75 చదరపు అడుగులు

సి.సుధాకర్ గుప్త, న్యాయవాది, లాయర్స్ కాలనీ, చిత్తూరు